

# ఇక్కడ పూలు పూస్తాయి

— బి. లలిత

ముక్కుకి సూటిగా చూస్తూ, ప్రయత్న పూర్వకంగా నిటారుగా నిలబెట్టిన నడుముతో నడుస్తోంది సంధ్య. తోపుడు బండి మీద చేతులు బిగుసుకున్నాయి. అందరూ తలలు తిప్పి చూస్తున్నారు. చూడనీ నాకేం అనుకుంది బలవంతాన. బండిలోని వసపిట్టలా వుంగా భాషలో వాగుతున్న చిన్ని ఆకారం కేసి చూడలేదు సంధ్య. తలవంచితే, కనులు కలిపితే కన్నీళ్ళు జారిపోతాయని.

వెనుదిరిగి పారిపోవాలన్న పిరికితనాన్ని నెట్టివేసింది. పార్కులో చెట్టు కింద ఆగి, పక్క పరిచి పాపని దింపింది. చెట్టు మీదికి కంగారుగా ఎక్కిపోయిందో ఉడత. దాన్ని తరుముతూ యింకొకటి. పిచికలూ, చిలుకలూ, కాకులూ అన్నీ గోలగానే అరుస్తున్నాయి. కాని సంధ్యకి తనవైపు దొంగతనంగా చూస్తున్నవారి గుసగుసలే సముద్రపు హోరులా వినిపిస్తున్నాయి.

ఈ చూపులను, చెవులు కొరుక్కోడాల్ని తను భరించగలదా? విశ్వనాథ్‌తో తనని చూసి పలకరింపుగా, ఆప్యాయంగా నవ్వేవారే...పాపనీ తననీ చులకనగా చూస్తుంటే—తను ఊరుకోగలదా?

ఎవరో యీలవేశారు. ఎదురుగుండా కలువలు నిండివున్న కొలను గట్టున చేరిన గుంపు. వీరే విశ్వాని, తనని—ఆదర్శ ప్రేమికులనీ వల్లకాడనీ అల్లరి చేసేవారు! ఒక చేతిలో కొన్ని పచ్చనోట్లు

## వినతి

'వనిత 'కు ప్రచురణ కోసమని కథలు, వ్యాసాలూ గేయాలూ మొదలైనవి పంపేవారు కొన్ని విషయాలను గుర్తుంచుకోవలసిందిగా కోరుతున్నాము. కథలు, వ్యాసాలూ సాధ్యమైనంత క్లుప్తంగా వుండాలి. పేజీకి ఒక్కవైపునే సిరాతో శుభ్రంగా, తెలిసేలా—రాయాలి. ప్రతి రచనపైనా, వారి పేరు, పూర్తి చిరునామా వుండాలి. అది ఏ రచన అయినాసరే, అది తమ సొంతం అని, దేనికీ అనుసరణ, మక్కీ కాదని, దీంతోపాటే ఇంకొక పత్రికకు కూడా పంపలేదనీ—హామీ పత్రం రాసి ఇవ్వాలి. ప్రతి రచనతోపాటు, తమ చిరునామా రాసివున్న కవరును స్టాంపులతో సహా జతచేసి, పంపితేగాని, సమాధానం ఇవ్వడానికిగాని, రచన తిప్పిపంపడానికిగాని వీలుండదు. రచనల పరిశీలనకు కనీసం మూడు మాసాలైనా వ్యవధి కావలసివుంటుంది. ఈలోగా, 'రచన ఏమైంది?' అని ఉత్తరాలు రాయడంవల్ల ప్రయోజనం వుండదు. (రచన ప్రచురింపబడే పక్షంలో, ముందుగానే రచయిత్రులకు తెలియజేయబడుతుంది) ఈ చిన్న విషయాలను గుర్తుంచుకుని, మాతో సహకరించవలసిందిగా రచయిత్రులను కోరుతున్నాము.

—వ. సం

విసనకర్రలా విరిశాయి.

చివాలున తల తిప్పుకుంది సంధ్య. కేరింతలు కొడుతోంది పాప. ఆ చిన్ని చేతికి తన వేలొకటి అందించింది. సరిగ్గా పాపపుట్టిన నెలలోనేకట్నాలు పుచ్చుకునే వాళ్ళమీద బహిరంగ చర్యలు తీసుకోడం మొదలెట్టింది ప్రభుత్వం. తనకేం లాభించింది? ఈ పరిస్థితి పదినెలల క్రితం వుండివుంటే?

పాప అనాథ అయివుండదు. తను తాళిలేని పెళ్ళికాని తల్లి అయివుండదు. తండ్రిపట్ల తన బాధ్యతే ఎక్కువ అనుకున్నాడు విశ్వూ. పెళ్ళి చేసుకుంటాడని—ఎంత నమ్మకం తనకి! ఈ పాప ఉనికీ – అతని పెళ్ళి శుభలేఖా ఒకేసారి ముట్టడించాయి తనని.

విశ్వూ నల్లని జుట్టూ—ముక్కూ సంతరించుకుని బోసి నోటితోనే నిండుగా నవ్వే పాప పునాది—అంత బలహీనమయినదని ఎవరూ చూసినవాళ్ళు అనుకోరు. సరదాకి మొదలెట్టి – పెళ్ళయ్యాక మానేద్దామనుకున్న ఉద్యోగం – భవిష్యత్తు చీకటి కాదన్న ధైర్యాన్నిచ్చింది. తోడి ఉద్యోగులు, మగవారు, పెళ్ళికాని నడివయస్కులైన స్త్రీలూ, పెళ్ళయిన పతివ్రతలూ వాళ్ళ వెటకారాలూ — చాటుగా అనుకునే మాటలూ భరించడం కష్టమయింది.

అందీ అందక ఉన్న సంధ్య కాలిని అందుకుందుకు ఎగిరెగిరి పడుతోంది పాప. ఎత్తుకొని గాల్లోకి ఎగరేసి పట్టుకుంది సంధ్య—పాప భాషలోనే తనూ మాట్లాడుతూ. దగ్గిర్లోనే సకిలింపులకి పట్టుబడ్డ దోషిలా—పాపని దించేసింది.

విశ్వూ తండ్రిమటుకు! ఎంత చనువుగా తిరిగేది ఆ యింట్లో తను! సంధ్యకేం బంగారు బొమ్మ అనేవారు. పెళ్ళిమాటలు ఆడాల్సి వచ్చేసరికి బంగారు బొమ్మ చాలకపోయింది. వర్కింగ్ వుమెన్స్ హాస్టల్ వార్డెను—'పసిబిడ్డలకి తావులేదు యిక్కడ. నీకూ తెలుసు. మా హాస్టల్ పేరుపోతుంది' అనేసింది. అదృష్టం కొద్దీ – తనతోటి ఉద్యోగినులు కలిసి వుంటున్న ఫ్లాట్‌లో ఒకమ్మాయి బదిలీ అయి వెళ్ళిపోయింది. వారంతా సహృదయలు. తన వయసువారే. పాప పుట్టినపుడు హాస్పిటల్‌కి కారియర్ తెచ్చిపెట్టీ—రాత్రిళ్ళు తోడు వుండీ—ఎంతో సాయపడ్డారు. పాపని నెత్తికెక్కించుకుంటారు. చివరికి అవి మురికిచేసిన బట్టలు మార్చడానికి కూడా పోటీలు పడతారు. మగవారూ—నడివయస్కులైన స్త్రీలే వ్యంగ్యాలూ, సూటిపోటీ మాటలు.

ఫ్లాట్‌లో అమ్మాయిలే-'పాపని పార్కుకి తీసికెళ్ళ తీరాలి నువ్వు-గాలీ వెలుతురూ తగలాలి పాపకి' అని బలవంత పెట్టారు. 'లోకానికి భయపడి లాభం లేదు. పాపని కనిపెంచుదామనుకున్నాక నలుగుర్లో నా కూతురని చెప్పి చూపించుకునే ధైర్యం చెయ్యొద్దా. ఎన్నాళ్ళు దాచుకుంటావు పాపని?' అని ధైర్యం చెప్పారు. పౌరుషాన్ని పంతాన్ని రెచ్చగొట్టారు.

నిజమే-తనెందుకు సిగ్గుపడాలి? తనదా తప్పు? పెళ్ళిని వ్యాపారం చేసిన విశ్వూ తండ్రిది. పెళ్ళి విషయంలో మాత్రం తండ్రి చాటు బిడ్డ అయిన విశ్వూది. కట్నం ఇచ్చుకోలేని తన ఆర్థిక పరిస్థితిది. కఠోర నిబంధనలలో మనిషిని కట్టి ఉంచే సమాజానిది. మమతని-ప్రేమానురాగాల్ని నలిపివేసే డబ్బు పిచ్చిది. తను చేసిన తప్పల్లా - ప్రేమించి—గుడ్డిగా నమ్మి ఆరాధించడం - పూజించడం.

పెళ్లి మాట ఎత్తిన స్నేహితురాళ్ళకి-మానవత మీద-మగవారి మీద నమ్మకం పోయింది అని జవాబిచ్చి వూరుకొంది. మరోసారి తన జీవితాన్ని ఛిద్రం చేసుకొనే సాహసం చేయలేదు తను. అనుమానపు నీడలు-అవమానపు మంటలు నిండి వుండే వైవాహిక జీవితం ఎందుకు? అక్కర్లేదు.

తన కాళ్ళ మీద తాను నిలబడగలదు. ఆ ధైర్యం తనకి వుంది. పాపని పెంచి పెద్ద చేయగలదు తను. ఈ వెటకారాలూ వ్యంగ్యాలూ వెక్కిరింతల నుంచి పారిపోదు. భరించగలదా అన్న ప్రశ్నే లేదు. భరించి తీరుతుంది తను. ఎన్నాళ్ళు మాట్లాడతారు కనక? విసుగెత్తి మానేస్తుంది లోకం. ఇంకే అమ్మాయీ తనలాగా వంచితురాలు కాకుండా - సహాయపడుతుంది తన పాప లాయరో - డాక్టరో అవుతుంది. తన హృదయం కాలిపోయిన బూడిద. పాప పెరిగి ప్రఖ్యాతి పూలు పూయడానికి ఎరువవుతుంది.

తన కుటుంబ చరిత్ర పాపని నొప్పించనివ్వదు. తండ్రి లేని లోటు తెలియనివ్వకుండా పెంచుకుంటుంది తను.

బుగ్గల మీద జారిన కన్నీళ్ళు తుడిచేసుకుంది సంధ్య. చీకట్లు నీడలు పరుస్తున్నాయి-పాపని గుండెలకి హత్తుకుని పెరాంబులేటర్‌లో కూర్చోపెట్టింది. నిరసనగా అటూ యిటూ చూస్తూ నడక సాగించింది. 'నవ్వుతున్నారా-నవ్వుకోండి మీసరదా మీది.' అనుకొంది. సంధ్య తల అప్రయత్నంగానే నిటారుగా నిలిచింది. తన ఫ్లాట్ చేరేసరికి ఆహ్వానించిన స్నేహితురాళ్ళకి - బుగ్గల మీది కన్నీటి చారికలు కంగారు పుట్టించినా-సంధ్య కళ్ళలో వెలుగుతున్న దీక్షా జ్యోతి - ఉత్సాహాన్నిచ్చింది.

ఉదయిస్తున్న నక్షత్రాలు మెరుస్తున్నాయి. రాత్రి ప్రారంభమైనా సూర్యుడు మరణించలేదు.

*